మృతి చెందిన ఎంబిఎ విద్యార్థులు

కదంతొక్కిన అంగన్వాడీలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- సిడిపిఒలకు వినతి పత్రం సమర్పణ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

యాప్‌ల భారం, సంక్షేమ పథకాలు అమలు, పనిగంటలు, ఒత్తిడి తగ్గింపు, జీతాల పెంపు కోసం అంగన్వాడీలు సిడిపిఒ కార్యాలయాల వద్ద కదం తొక్కారు. సంవత్సరాలు తరబడి అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గురువారం అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్త ధర్నాలో భాగంగా అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. పట్టణంలోని ఐసి డిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు ఆయాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గ్రాట్యూటీ జీఓను మినీ వర్కర్లు 1800 మందిని పదవ తరగతి పాస్ కాలేదన్న కారణంగా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చకపోవడం దారుణ మన్నారు. విద్యార్హతను మినహాయింపు ఇచ్చి అనుభవాన్ని చూసి మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలన్నారు. అనంతరం సిడిపిఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సిద్దమ్మ, విజయమ్మ, సుమలత, సురేఖ, పద్మజ, ఉమాదేవి, రెడ్డమ్మ, షహనా, కాళవతి, శంకరమ్మ, భూదేవి పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐ టియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బిజ్జేల రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్‌తో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అంగన్వాడీ వర్కర్లు, ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనం పేరుతో వెట్టి చాకిరి చేయిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి పాలనలో అంగన్వాడీల ఆందోళన సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న నేటి సిఎం చంద్రబాబు కుప్పం దీక్షల వద్ద మద్దతిచ్చి వేతనాలు పెంచుతానని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఏడాది దాటినా వేతనాలు పెంచలేదన్నారు. గత 42 రోజుల సమ్మె సందర్భంగా జూన్‌లో యూని యన్ ఆధ్వర్యంలో జీతాలు పెంచుతామని చెప్పి ప్రభుత్వ మినిట్స్ అమలు చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రూ.1500 లెక్కన పెంచుతున్నట్లు రెండుసార్లు ప్రకటించి మోసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి విజయమ్మ, సెక్టార్ లీడర్లు వనిత, లావణ్య, స్వర్ణ, మమత, శివజ్యోతి, విజయలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె సిడిపిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూని యన్ నాయకులు మధురవాణి, భాగ్యమ్మ మాట్లాడుతూ అంగ న్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఐసిడిఎస్‌లో మార్పులు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయలేద ని, పోషణ్‌ట్రాకర్, బాలసంజీవిని యాప్‌ల అమలుకు ఫోన్లు ఏమాత్రం సపోర్ట్ చేయటంలేదన్నారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నెట్ సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా లబ్ధిదారులకు ఫొటోక్యాప్చర్, ఒటిపి ద్వారా సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయటానికి అంగ న్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్‌లను రద్దు చేయాలని, నిర్వహణకు ట్యాబ్, 5జి నెట్ ఇవ్వా లన్నారు. ప్రధానమంత్రి మాతృవందనం పథకాన్ని అంగన్వాడీలకు రద్దు చేయాలన్నారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : ప్రధాని మోడీ వేతనాలు పెంచాలని సరిచేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నాలుగు గంటలకి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ధర్నా నిర్వహించింది. కార్యక్రమంలో మైథిలి, గాయత్రి, జయకుమారి, కుమారి పాల్గొన్నారు.

రాయచోటి : ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

రాజంపేట : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

మదనపల్లి : సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

రాజంపేటలో విషాదం

- ఈతకు వెళ్లి ముగ్గురు ఎంబిఎ విద్యార్థుల మృతి
- క్షేమంగా బయటపడ్డ ఐదుగురు విద్యార్థులు
- మృతులు రాజంపేట, ఒంటిమిట్ట, పోరుమామిళ్ల వాసులుగా గుర్తింపు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో బుధవారం చోటు చేసుకున్న విషాదం మరువక ముందే అన్నమయ్య జిల్లా రాజంపేటలో గురువారం మరో విషాయం చోటు చేసుకుంది. సరదాగా ఈత కోసం వెళ్లిన ఎనిమిది మంది ఎంబిఎ విద్యార్థుల్లో ముగ్గురు ఊబిలో చిక్కుకుని మృత్యువాతపడ్డారు. ఈత సరదా మూడు ప్రాణాలు బలి తీసుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెయ్యేరు నదిలో నీరు ప్రవహిస్తుం డడంతో అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన 8 మంది విద్యార్థులు మండల పరిధిలోని బాలరా జుపల్లి వద్ద నదిలో సరదాగా ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ఈ దారుణ ఘటన మూడు కుటుంబాలను కబలించి వేసింది. వివరాల్లోకి వెళితే...స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నమాచార్య యూనివర్సిటీలో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 8 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని అటవీ ప్రాంతమైన బాలరాజుపల్లి వద్ద ఉన్న చెయ్యేరులోకి గురువారం సరదాగా ఈతకు వెళ్లారు. వారిలో నలుగురు యువకులకు ఈత కూడా రాకపోవడంతో గల్లంతయ్యారు. మిగిలిన నలుగురు యువకులు ఒకరిని మాత్రం రక్షించ గలిగారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. రాజంపేట మండలం గాలివారిపల్లెకు చెందిన సోంబత్తిన దిలీప్ (22), ఒంటిమిట్ట మండలం మంటపంపల్లెకు చెందిన కొత్తూరు చంద్రశేఖర్ (22), పోరుమామిళ్ల మండలం చిన్నప్పవీధికి చెందిన పీనరోతు కేశవ (22) నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. దళారులు ఇసుక కోసం తీసిన గోతులు కూడా ఈ దుర్ఘటనకు కారణమని స్థానికులు చర్చించుకుం టున్నారు. మన్నూరు సిఐ ప్రసాద్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతయిన మృతదేహాలను వెలికి తీయించి పంచనామా నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తుపై గంపెడు ఆశలు పెట్టుకుని జీవిస్తున్న మూడు కుటుంబాలలోని తల్లిదండ్రులు విగత జీవులైన తమ పిల్లల్ని చూసి గుండెలదిరేలా రోదిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ సరదాల కోసం ప్రాణాపాయ స్థితికి తెచ్చుకోవడం సరికాదని, ఈత కూడా రాని యువకులు ఏటిలో దిగడం సమంజసం కాదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా యువత సమాలోచన చేయాలని సూచిస్తున్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వినాయక విగ్రహం ఏర్పాటు చేసేవారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్ఒ అనుమతి తప్పకుండా తీసుకోవాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. గురు వారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న వినాయక చవితి పండగ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో విగ్రహాలు ప్రతిష్ట చేసేవారు, ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు సంబంధిత పోలీస్ స్టేషన్లలో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వినాయక ఉత్సవాల మండపం ఏర్పాటుకు ఆన్‌లైన్ విధానంలో అనుమతి పొందా లన్నారు. దీనికోసం ganeshutsav.net వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఎన్ఒసి పొందాలని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ అధికారి ఆ మండప ప్రాంతాన్ని పరిశీలించి క్యూఆర్‌తో కూడిన అనుమతి జారీ చేస్తారని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట చేసేవారు 5 లేదా అంతకంటే ఎక్కువమంది కమిటీగా ఏర్పడి వారి వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలపాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీ లేదా ప్రయివేట్ స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసేవారు సంబంధిత యజమాని ద్వారా అనుమతి పొందాలని తెలిపారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖ అనుమతి తీసుకొని వారు సూచించిన నియమ నిబంధనలు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు మండపాల వద్ద ఇసుక, నీళ్ల డ్రమ్ములు ఏర్పాటు చేసుకొని ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జనం ప్రదేశం, నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లో తెలియజేయాలన్నారు. పెద్ద పెద్ద సౌండ్ లతో, లౌడ్ స్పీకర్లు పెట్టకూడదని, రాత్రి సమయాలలో మండపాల వద్ద డబ్బులు, బంగారం లాంటి ఇతర విలువైన వస్తువులు పెట్టకూడదని తెలిపారు. వినాయక పందిళ్ళ వల్ల రోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో కులాలు, మతాలు పార్టీలకు వ్యతిరేకంగా, రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే ముందుగా పోలీస్ అధికారులకు లేదా డయల్ 112 నెంబర్‌కు తెలియజేయాలని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన విజ్ఞప్తులు, భూముల రీ సర్వే, భూ వివాదాల పరిష్కారం, రికార్డుల అప్డేషన్ వంటి రెవెన్యూ అంశాల్లో కీలక పాత్ర పోషించి నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం ఆదిత్య ఇంజి నీరింగ్ కళాశాలలో రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, సమయ పాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేయడంపై రెవెన్యూ శాఖ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రజాసేవ పట్ల విధేయత, బాధ్యతల గురించి స్పష్టమైన మార్గదర్శకాలతో దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా రీసర్వేలో జాయింట్ ఎలిమెంట్స్ తగ్గించే విధంగా చూడాలని, రీసర్వేలో అనవసరంగా జాయింట్ ఎలిమెంట్స్ పెడితే రైతులు, భూస్వాములు ప్రభుత్వ పథకాల పొందేందుకు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ భూములు కాలిబాట, పాదదారి మార్గం, బండి దారి, నీటి వనరులు, చెరువులు, ఎలాంటి ఆక్రమ ణలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులు నిర్లక్ష్యం, అవినీతి కారణంగా రెవెన్యూ శాఖకు ప్రతికూలతలు ఏర్పడుతున్నాయని, అలా రాకుండా ప్రతి ఒక్కరు నిజాయితీగా, బాధ్యతగా వ్యవహరించి ప్రజాసేవలో పారదర్శకత చూపా లన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే, ఉద్యోగ భద్రత కోల్పోవాల్సి వస్తుందని, పనులు సరిగా చేయని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత చేరువగా ఉండి, పారదర్శకంగా పనిచేసేలా ప్రోత్సాహం లభిస్తుందని, ప్రజల సేవే రెవెన్యూ శాఖ ప్రధాన లక్ష్యమని అధికారులు పునరు ద్ఘాటించారు. పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ వివాదాల దరఖాస్తులు, భూముల రీ సర్వే, రికార్డుల అప్డేషన్, సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఏడిఎస్ బి పోర్టల్, వరస్తా వివాదాలు అంశాల్లో రెవిన్యూ సిబ్బంది కీలక పాత్ర పోషించా లన్నారు. ప్రతి అధికారి నిజాయితీ, పారదర్శకతతో సేవలు అందించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ప్రజలను కార్యాలయాలకు పదేపదే తిప్పుకోవడం, నిర్లక్ష్యపు సమాధానాల వంటివి ఇవ్వకుండా మెరుగైన సర్వీసులు అందిస్తే రెవెన్యూ సిబ్బందికి తద్వారా జిల్లాకు, ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని స్పష్టం చేశారు. అధికా రులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎవరూ ఇబ్బంది పడకుండా రెవెన్యూ సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఉద్యోగులందరూ ప్రజలకు జవాబుదారీ తనంతో పని చేస్తూ ప్రజల వినతు లను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. సమయపాలన తోపాటు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రెవెన్యూ అంశాల్లో మెరుగ్గా పని చేసి మంచిపేరు తీసుకురా వాలన్నారు. ప్రతి రెవెన్యూ అధికారి తన పనిలో బాధ్యత, క్రమశిక్షణ, నిబద్ధ తతో వ్యవహరించాలని సూచించారు. వివిధ రెవెన్యూ అంశాల్లో నిర్దేశించిన శిక్షణా కార్యక్రమాల ద్వారా అధికారులు తమ పనితీరును మరింత మెరుగుపరచి, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలన్నారు. రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తే జిల్లాకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు రెవెన్యూ అంశాలకు సంబంధించి వివిధ రకాల సేవలను అత్యంత వేగవంతంగా అందించే విధంగా వివిధ రకాల యాప్ లను టెక్నాలజీని వినియోగించుకుని అత్యంత నాణ్యతమైన, త్వరితగతిన పనులు చేసి పారదర్శకమైన పాలన అందించే విధంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భరత్ కుమార్, మదనపల్లె డివిజన్ మండల తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

వ్యాధి నిర్ధారణపై అవగాహన అవసరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

కేన్సర్ వ్యాధి నిర్ధారణపై వైద్యులతో పాటు సిబ్బంది కూడా పూర్తిస్థాయి అవగాహనను కల్పించు కోవాలని డిఎంహెచ్ఒ లక్ష్మినరసయ్య అన్నారు. గురువారం పట్టణంలోని రామాపురం అర్బన్ పిహెచ్‌సిలో వైద్యులకు కేన్సర్ నిర్ధారణపై రెండురోజుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన పౌరులందరికి కేన్సర్ (రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్)పరీక్షలు నిర్వహించి అనుమానితులను రెఫరల్ ఆసుపత్రులకు పంపుతారన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్సను ప్రారంభిస్తామన్నారు. మొదటగా వైద్యులకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా పిహెచ్‌సిలలోని ఎంఎల్‌హెచ్‌సి, ఎఎన్ఎం, ఆశాకార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. చివరగా ఇంటింటి సర్వేను నిర్వహిస్తామంటూ చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ శివప్రతాప్, వైద్యులు నీలోఫర్, అహమ్మద్‌బాష, రెడ్డికీర్తి, నరేష్, జరీనాబేగంతో పాటు జిల్లాలోని పలుపిహెచ్‌సిలు, అర్బన్ పిహెచ్‌సిల వైద్యులందరూ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం సాధనకు పోస్టు కార్డుల ఉద్యమం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట జిల్లా కేంద్ర సాధనకు జెఎసి ఆధ్వర్యంలో వడివడిగా అడుగులు సాగుతు న్నాయి. ఇటీవల జెఎసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాలు అందించారు. న్యాయ వాదుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిచంద్రబాబుకు పోస్ట్ కార్డుల ద్వారా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న తమ ఆకాంక్షను తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కావలసిన అన్ని వనరులు, వసతులు రాజంపేటలో ఉన్నాయని, ప్రజల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు.

సామూహిక సెలవులో పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

తమ సహా ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ రాయచోటి రూరల్ మండలానికి చెందిన కార్యదర్శులు సామూహిక సెలవుపై వెళ్లారు. ఐవిఆర్ఎస్ కాల్స్ సక్రమంగా నిర్వహించ లేదన్న కారణంగా రాయచోటి డివిజన్ పరిధిలోని నలుగురు పంచాయతీ కార్యదర్శులను రెండు రోజుల కిందట కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇందుకు నిరసనగా రాయచోటి రూరల్ మండలంలోని చెన్నముక్కపల్లి, గొర్ల ముదివేడు రమాదేవి, సిబ్యాల వెంకటరమణ, పెమ్మాడపల్లి సాజియా, దిగువ అబ్బవరం శివలక్ష్మి, కాటిమాయకుంట మల్లికా ర్జున తదితర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుపై వెళ్లారు. ఈ మేరకు కార్యదర్శులు గురువారం ఎంపిడిఒకు సురేష్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు.

ఎంపిడిఒ సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వికలాంగుల పింఛను తొలగించేందుకు కుట్ర

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వికలాంగుల పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛను హామీని గాలికొదదిలేసిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న పింఛన్లు తొలగించే పనిలో పడిందన్నారు. తొలివిడతగా వికలాంగుల ఆరోగ్య పింఛన్లపై కన్నేసిందన్నారు. కూటమి వచ్చీ రాగానే రీవేరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరిట వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం సర్టిఫికెట్ చేయించు కోవాలని షరతు పెట్టిందని, వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధృవీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకురావాలని కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టిందన్నారు. దీంతో పది,పేదిహేనేళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకుని, వైద్య పరీక్షలు చేయించు కున్నారన్నారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సింది పోయి, వారి బతుకులతో ఆటలాడుకుంటోందని, వారిపై ఎందుకంత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారో చెప్పాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు ఇవ్వరని ఆయన ప్రశ్నించారు. అప్పుడు అర్హులు.. ఇప్పుడు అనర్హులా? అని పేర్కొన్నారు.

స్టేజీ క్లోజ్ చేయకపోవడంతోనే రూ.20 టికెట్ జారీ : ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి డిపో కండక్టర్ నిర్లక్ష్యంగా స్టేజీ క్లోజ్ చేయడకపోవడం వల్ల రూ.10 కి బదులు రూ.20 టికెట్ జారీ అయిందని రాయచోటి డిపో మేనేజర్ జి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి డిపో మేనేజర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్త్రీ శక్తి పథకం అమలు చేసిందని దీన్ని ఆర్‌టిసి నిలువు దోపిడీ చేసిందన్న వార్తపై విచారణ చేపట్టామని అన్నారు. ఇందులో కండక్టర్ నిర్లక్ష్యంగా స్టేజీ క్లోజ్ చేయకపోవడంతో రూ.10 బదులు రూ.20 టికెట్ జారీ అయిందని పేర్కొన్నారు. వడిసిలంక నుంచి గాలివీడు గేటు వరకు ఇద్దరు మహిళ ప్రయాణికులు బస్సు ఎక్కారని రాయచోటి డిపోకు చెందిన కండక్టర్ 141 కార్డు ప్రకారం రామాపురం 5వ స్టేజీ, గోరాన్ చెరువు 6వ స్టేజీ, గాలివీడు 7వ స్టేజీ కావడంతో ఇద్దరు మహిళలు వడిసెలంక రిక్వెస్ట్ స్టాప్ వద్ద ఎక్కారని చెప్పారు. రామాపురం 5వ స్టేజీ కండక్టర్ క్లోజ్ చేయని కారణంగా ఇద్దరూ మహిళా ప్రయాణికులకుకి వడిసెలంక నుంచి గాలివీడు వరకు టికెట్ కొట్టగా, రామాపురం నుండి గాలివీడు వరకు రూ. 20 టికెట్ జారీ అయిందని పేర్కొన్నారు. కండక్టర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త కారణంగానే జరిగింది తప్ప అదనపు ఛార్జీ వసూలు చేయాలని ఉద్దేశం కాదని అన్నారు. ఈ విషయంపై సంబంధిత కండక్టర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్త్రీ శక్తి పథకంపై గతంలో డ్రైవర్లకు, కండక్టర్లకు శిక్షణతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇచ్చామని చెప్పారు. ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాయచోటి డిపోలో సంస్థ నియమావళి ప్రకారమే టికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. వర్షపునీరు రోడ్లపైకి రాకుండా మురికి కాలువలు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాల ని సూచించారు. తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది, ఆటంకం కలగకుండా విధంగా ప్రణాళికలు రచించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతను నివారించాలి

- డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

జిల్లా వ్యాప్తంగా ప్లస్‌టు పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు డిఇఒ సుబ్రమణ్యంకు విన్నవించారు. గురువారం సాయంత్రం వారు డిఇఒను ఆయన కార్యాల యంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జిల్లాలో ఇప్పటికే అనేక రకాల బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తెరిగి విద్యాశక్తి కార్యక్రమాన్ని ఐచ్ఛికంగానే అమలు చేయాలంటూ కోరారు. విద్యార్థులందరికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల కొరత లేకుండా చూడాలంటూ డిమాండ్ చేశారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన టెన్త్ పరీక్షల నిర్వహణ, పరీక్షపేపర్లు దిద్ది మార్కులు వేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులకు ఇవ్వాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో వెంటనే చెల్లించాలన్నారు. డిఇఒ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల బిల్లులు ట్రెజరీలో ఆమోదం పొందాయని, త్వరలో ఉపాధ్యాయుల ఖాతాలో జమ అవుతాయంటూ హామీ యిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్య దర్శి దావూద్, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, ఆడిట్‌కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, వరదారెడ్డి పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యుటిఎఫ్ జిల్లా నేతలు

త్వరలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

త్వరలో జిల్లా కేంద్రమైన రాయ చోటిలో తమ సంస్థ ఆధ్వర్యంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రోటరీక్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్‌లు డాక్టర్ రెడ్డెన్న, పప్పిశెట్టి సురేష్‌కుమార్, రియాజ్, ప్రతినిధులు కృష్ణదేవరాయులు, మాజీ అధ్యక్షులు మనోజ్ కుమార్ తెలిపారు. బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ (బికెఎఫ్), రాయచోటి జెపి హాస్పిటల్ వారి సహాయ, సహకారాలతో సెంటర్‌ను నిర్వహిం చను న్నట్లు పేర్కొన్నారు. గురువారం బెంగళూరు నుండి విచ్చేసిన బికెఎఫ్ ప్రతినిధులు, చైర్మన్ శ్రీరామ్, సుధీర్, వసంత్‌చంద్ర తదిత రులతో కలసి రోటరీ క్లబ్ సభ్యులు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయబోయే జెపి ఆసుపత్రిని సందర్శిం చారు. అక్కడ కేంద్రం ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాయచోటితో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజల ప్రయోజనార్థం డయాలసిస్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. లాభాపేక్షంతో కాకుండా కేవలం సేవాభావంతో తక్కువ ఖర్చుతో రోగులకు వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. సెంటర్ నిర్వహణకు అవసరమైన సొమ్మును మాత్రమే రోగుల నుండి వసూలు చేయనున్నట్లు తెలిపారు. రాయచోటి ప్రాంత ప్రజలు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెపి ఆసుపత్రి ప్రతినిధులు, రోటరీక్లబ్ సభ్యులు అష్రఫ్ అలీతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆదర్శంగా అంగన్వాడీ కేంద్రాలు : ఎంపిడిఒ

పుల్లంపేట : రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ జయశ్రీ

ప్రజాశక్తి-పుల్లంపేట

అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ జయశ్రీ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పుల్లంపేట శివాలయం వీధిలో ఉన్న అంగన్వాడీ 1,2 కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఎఎన్ఎంను పిలిపించుకొని ప్రతివారం ఆరోగ్యశాఖకు సంబంధించి చిన్నపిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వ్యాక్సినేషన్ సక్రమ పద్ధతిలో వేయించాలని సూచించారు. పౌష్టికాహార లోపాన్ని అధికమించడానికి ప్రభుత్వం పాలు, గుడ్లు, బాలామృతం అందిస్తుందని చెప్పారు. గర్భిణులు, పోషకాహారమైన ఆకుకూరలు, కూరగాయలు, పాలు క్రమం తప్పకుండా తీసుకుంటూ రక్తహీనతలను అధిగమించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. బలమైన పోషకాహారాన్ని చిన్నారులకు అందించడం ద్వారా వారు ఆరోగ్యంగా ఉంటూ మంచి ఎదుగుదలకు సాధించగలరని పేర్కొన్నారు. బలహీనంగా ఉన్నవారికి తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డివారిపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన రికార్డులను, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు, బాలింతలకు గర్భవతులకు అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని తనిఖీ చేశారు. చిన్నారులు ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా అంగనవాడి సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలపై చిన్నారులకు ఆసక్తి పెంపొందించేలా అంగన్వాడీ కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. వారికి ప్రీ ప్రైమరీ విద్యాభ్యాసాన్ని నేర్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు పౌష్టికాహారం అందించేలా అవగాహన కల్పించాలన్నారు. క్రమం తప్పకుండా గర్భవతులకు బాలింతలకు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనతను, చిన్నారులలో ఎదుగుదలను, ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు కూడా వారి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలలను సందర్శించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్ బాబు

పింఛన్ల నిలిపివేతపై ఆవేదన

ఇన్‌ఛార్జి ఎంపిడిఒకు వినపత్రి పత్రం అందిస్తున్న అర్హులు

ప్రజాశక్తి-చిట్వేలి

మండలంలోని సుమారు 120 పింఛనపైగా నిలిచిపోవడంతో కొందరు లబ్ధిదారులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా అర్హులైన అందరికీ పెన్షన్ పథకాన్ని అందిస్తూ అర్హత లేని అనర్హులైన వారిని గుర్తించి తొలగించడం జరిగిందని భావిస్తున్న తరుణంలో పుట్టుకతో మూగ, చెవుడు ఉన్న విభిన్న ప్రతిభావంతులు కూడా అనర్హుల జాబితాలో రావడం బాధాకరమని లబ్ధిదారులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విజయ్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గతంలో జరిగిన పింఛను దారుల పరిశీలనలో ఏవైనా పొరపాట్లు ఉంటే తిరిగి మరొకసారి అవకాశం వస్తుందని, తమ దృష్టికి వచ్చిన అర్హులైన లబ్ధిదారులు వారికి సంబంధించిన పత్రాలను జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

హత్య కేసులో ఇద్దరు అరెస్టు

- గంజాయి స్మగ్లింగే కారణం

- గుంతకల్లు రైల్వే డిఎస్‌పి శ్రీనివాస్ ఆచారి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఖదీర్ హత్య కేసులో ఇద్దరు నిందితులు పి.అసిఫ్‌ఖాన్, షేక్ మౌలాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గుంతకల్లు రైల్వే పోలీస్ డిఎస్ పి శ్రీనివాస్ ఆచారి, ధర్మవరం రైల్వే సిఐ అశోక్ కుమార్ లు తెలిపారు. సిఐ కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఖదీర్ ఐదేళ్ల నుంచి మదనపల్లెలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తూ మదనపల్లెలో విక్రయం చేసేవాడు. మదనపల్లి పట్టణం, బసినికొండలో నివాసం ఉన్న జహీర్‌ఖాన్ కుమారుడు ఆసిఫ్ ఖాన్, అతను తల్లి ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి విక్రయాలు చేసేవారు. గంజాయి విక్రయించే సమయంలో ఖదీర్‌తో ఆసిఫ్‌ఖాన్ పరిచయమవ్వడంతో అసీఫ్‌ఖాన్ స్నేహితులు సుల్తాన్, మౌలాలకు గంజాయి విక్రయించేవాడు. ఆసిఫ్ నెలరోజుల క్రితం రెండు కిలోలు గంజాయి కావాలని ఖదీర్ కు రూ.50 వేలు ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా గంజాయి ఇవ్వలేదు. తీసుకున్న నగదు ఇవ్వలేదు.ఈ నెల 15న ఆసిఫ్ స్నేహితులైన సుల్తాన్, మౌలా, మరో ఇద్దరితో కలిసి, అంగళ్లు లో ఇంట్లో ఉన్న ఖదీర్ ను కారులో కర్ణాటక రాష్ట్రం, రాయల్పాడుకు తీసుకెళ్లి కట్టెలతో చితకబాదారు. గంజాయి తెచ్చిస్తానని చెప్పడంతో మదనపల్లెకు తీసుకొచ్చి అసిఫ్ ఇంట్లో మరోసారి చితకబాధడంతో ఖదీర్ మృతి చెందాడు.ఆసిఫ్, మౌలాతో ఆటోలో మృతదేహాన్ని సిటియం రైల్వే స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. మృతదేహాన్ని రైలు పట్టాలపై వేయడానికి ప్రయత్నిస్తుండగా, ఆ సమయంలో ఓ వాహనం లైట్లు వేసుకొని వస్తుండడం చూసి భయంతో బ్రిడ్జి మెట్లపై పడేసి పారిపోయారు. ఉదయం స్థానికులు అండర్ బ్రిడ్జిపై మృతదేహం పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పడి ఉన్న ప్రదేశం రైల్వే సంబంధించిన కావడంతో ధర్మవరం రైల్వే సిఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. మృతుడు మృతి చెందడానికి ముందు ఆసిఫ్ ఆటోలో వెళ్తున్నట్లు సమాచారం రావడంతో సిఐ ఆ కోణంలో దర్యాప్తు చేపట్టి నిందితులు మౌలా, ఆసిఫ్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో సుల్తాన్‌తో పాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పెద్ద తిప్ప సముద్రంలో జరిగింది. బాధితుడి కుటుంబ సమస్యల కథనం మేరకు.. పిటిఎంలో ఉంటున్న రైతు నరసింహులు కుటుంబ సమస్యల కారణంగా పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఈఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో ఢీకొని యువ రైతుకు గాయాలు

మదనపల్లె అర్బన్

ఆటో ఢీకొని రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బి.కొత్తకోట మండలం, గట్టుకు చెందిన వెంకటరమణ కుమారుడు జయంత్ కుమార్ మదనపల్లె మండలం సిటిఎంలో వ్యవసాయం చేస్తుకుంటున్నాడు. ఉదయం వ్యవసాయ పని నిమిత్తం సిటియం వెళ్లిన అతను తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యంలోని అంగళ్లు భారత్ పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వచ్చిన మరో ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూర కు రెఫర్ చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు బాధితుడిని బెంగుళూరుకు తీసుక వెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈనెల 27వ తేదీ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలో వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు పోలీసుల అనుమతి తప్పని సరి అని సిఐ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండుగను సామరస్యంగా జరుపుకోవాలని, పోలీసుల నిబంధనలకు లోబడే వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీ అని, అందుకు వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషనులో అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యం చేయరాదన్నారు. అంతే కాకుండా పర్యావరణానికి ముప్పు లేకుండా మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అశ్లీ నృత్యాలు నిషేదమన్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- ఆందోళన చెందుతున్న వాహనదారులు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లె నుంచి రాయచోటి వెళ్లే ప్రధాన రహదారిలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రోడ్డు తీరు మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిలో గతంలో డబల్ రోడ్డు పనులు ప్రారంభించి అరకొరగా చేసి వదిలేశారని అన్నారు. రాయచోటి నుంచి సుండుపల్లెకు వాహనాలలో రావాలంటే గంట ప్రయాణం రెండు గంటలు పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుంపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృతి చెందారని, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. అయినా కూడా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని అంటున్నారు. ప్రతి నిత్యం ఇదే రోడ్డులో జిల్లా ఉన్నతాధికారులు , ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారని వారికి కూడా ఈ రోడ్డును డబుల్ లైన్ రోడ్డు మార్చాలనే ఉద్దేశం కలుగకపోవడం శోచనీయమని అన్నారు. రాయచోటి-సుండుపల్లె రోడ్‌లో ఆర్‌టిసికి ఎక్కువ ఆదాయం వస్తోందని, అలాంటిది ఆదాయం తీసుకుంటూ పనులు చేయకపోవడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు. తరుచుగా ప్రయాణికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు సైతం పోతుంటే ఎందుకు ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఈ సమస్య పట్టదని ప్రశ్నిస్తున్నారు. గతంలో కాంట్రాక్టర్లు వారికి నచ్చిన చోట పనులు చేశారని, మిగిలిన చోట అలాగే వదిలేశారని అన్నారు. అవి ఇప్పుడు గుంతలు గుంతలుగా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందన్నారు. ద్విచక్రవాహనదారులు తరచూగా ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిథులు, మండల అధికారులు స్పందించి ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

గుంతల మయంగా రాయచోటి-సుండుపల్లి రోడ్డు

సచివాలయాల్లో అందుబాటులో లేని ఆధార్ సేవలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-చిట్వేలి

మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో మూడు ఆధార్ సేవ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇటీవల సచివాలయ సిబ్బందిలో జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా సచివాలయాల్లో ఉన్న ప్రభుత్వ ఆధార్ కేంద్రాలు మూతపడ్డాయి. ఇదే అదునుగా తీసుకున్న ఆధార్ నమోదు కేంద్రాలు ఇష్టాను సారంగా అధికంగా డబ్బును వసూలు చేయడమే కాకుండా కనీస అవసరాలు అందుబాటులో లేకుండా కొనసాగిస్తున్నారు. చిట్వేలి సచివాలయం-1లో ఆధార్ కేంద్రం అందరికీ అందుబాటులో ఉండటంతో సమస్యలు లేకుండా ఉండేవి. ప్రస్తుతం అక్కడ ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడం ఆధార్ కేంద్రాలను నడిపే వారికి ఆర్థిక వనరుగా మారింది. ప్రయివేట్‌గా మంజూరు చేసిన ఆధార్ కేంద్రాల్లో ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో ఆధార్ సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల్లో అందుబాటులో ఉన్న ఆధార్ సెంటర్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

సచివాలయంలో ఆధార్ సేవలు పునఃప్రారంభించాలి

మాది చిట్వేలి గ్రామం. మాకుమార్తె తనుశ్రీ వయస్సు తొమ్మిది సంవత్సరాలు. పాఠశాలలో చేర్పించేందుకు ఆధార్ కార్డులో మార్పు కోసం నెల రోజులుగా తిరుగుతున్నాను. సచివాలయంలో ఉన్న ఆధార్ సెంటర్ అందుబాటులో లేదు. పంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న ఆధార్ కేంద్రంకు వెళ్లినప్పుడల్లా సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి వెళ్లమని చెబుతున్నారు. అక్కడ నెల రోజుల నుంచి ఆధార్ సేవలు నిలిచి పోయాయి. సచివాలయంలో ఆధార్ సేవలు పునః ప్రారంభించాలి.

-శాంతి, చిట్వేలి

జగన్‌మోహన్‌రాజుకే..రాజంపేట టిడిపి పగ్గాలు

- అధికారికంగా ప్రకటించిన అధిష్టానం
- కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి ఉన్న ప్రతిష్టంభన అధిష్టానం ఎట్టకేలకు తెరదించింది. ఎందరో ఆశావహులు, మరెన్నో ఊహాగానాలకు తెరదించుతూ బుధవారం రాత్రి సిఎం చంద్రబాబు చమర్తి జగన్మోహన్ రాజును ఇన్‌ఛార్జిగా అధికారికంగా ప్రకటించారు. దీంతో చమర్తి అభిమానులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా బాణాసంచా పేల్చి, కేకులు కోసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఓ సాధారణ కార్యకర్త నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జిదాకా చమర్తి రాజకీయ ప్రయాణం ఒక దుర్భేద్యమనే కార్యకర్తలు చెబుతున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ప్రజాశక్తితో మాట్లాడుతూ వీరబల్లి మండలం, ఓదివీడు గ్రామంలోని ఎర్రమరాజుగారిపల్లె ఐన ఒక మారుమూల గ్రామానికి చెందిన సుబ్బరాజు, పద్మావతమ్మల రెండవ కుమారుడు చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. ఆయన సోదరుడు విజయ్ కుమార్ రాజు గతంలో సర్పంచ్ గా సేవలందించారు. ఇంజినీరింగ్ లో పట్టా పొందిన జగన్మోహన్ రాజు 'రాజు' విద్యా సంస్థలను స్థాపించి పేద, మధ్యతరగతి వారికి అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తూ అనతి కాలంలోనే విద్యావేత్తగా పేరుగాంచారని అన్నారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన ఆయన సమాజానికి ఏదో చేయాలన్న తపనతో గుమ్మం తొక్కి వచ్చిన వారికి లేదనుకుండా సాయం చేసేవారని అన్నారు. ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం, అన్నదానాలు చేయడంతో పాటు చురుకైన పేద విద్యార్థులను గుర్తించి వారికి విద్యా దానం చేసి వారిని గొప్ప వైద్యులుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దారని అన్నారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలే ఆయనకు గుర్తింపు తీసుకొచ్చాయని అన్నారు. ఆది నుంచి సమాజ సేవలో తరిస్తున్న వారి కుటుంబాన్నే ఆయన ఆదర్శంగా తీసుకుని ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేయాలన్న లక్ష్యంతో దివంగత ఎన్‌టి రామారావు సిద్ధాంతాలకు ఆకర్షితుడై బడుగు బలహీన వర్గాల వాణిగా నిలిచిన తెలుగుదేశం పార్టీలో ఓ సాధారణ కార్యకర్తగా ఆయన ప్రయాణం ప్రారంభించారని అన్నారు. దశాబ్ద కాలానికి పైగా ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న ఆయన మొట్టమొదటిగా రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడిగా నియమితులయ్యారని అన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా పీలేరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి సభ విజయవంతం అవ్వడానికి కీలక పాత్ర పోషించారని అన్నారు. పార్లమెంట్ అధ్యక్షుడిగా పార్లమెంటు పరిధిలోని మారుమూల గ్రామాలకు సైతం సందర్శించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని బలోపేతం చేసుకుంటూ వచ్చారు. ఓవైపు ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ, అధికార పార్టీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎండగడుతూ మరోవైపు కార్యకర్తలకు అండగా నిలబడ్డారని అన్నారు. కడప నగరంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమం విజయవంతం అవడంలో పార్లమెంటు పరిధి నుంచి ప్రత్యేక కృషి చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇటీవల జరిగిన ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుపుకు విశేష కృషి చూపడంతో పార్టీ అధిష్టానం చమర్తి ని ప్రత్యేకంగా గుర్తించిందని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఇటీవల చేరడంతో పుచ్చుకోవడంతోనూ, పార్లమెంటు అధ్యక్షుడిగా చమర్తి సారథ్యంలో నియోజకవర్గంలో పార్టీ బలపడిన విధానం అధిష్టానాన్ని ఆకర్షించి బుధవారం రాత్రి చమర్తి జగన్మోహన్‌రాజును నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించారని అన్నారు. ఏది ఏమైనా ఓ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పార్లమెంట్ అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన చమర్తి రాజకీయ ప్రస్థానం వెనుక ఎన్నో ఆటుపోట్లు, అవమానాలు సైతం ఎదుర్కొని నేటి తరం రాజకీయ నేతలకు ఒక ఆదర్శంగా నిలిచారని చెప్పడంలో సందేహం లేదన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రాజ్యసభ సభ్యులు 'మేడా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఎర్రన్నను గురువారం వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు రైల్వే సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. కేంద్ర రైల్వే మంత్రితో గుంతకల్ డివిజన్ పరిధిలోని సౌత్ సెంట్రల్ రైల్వే పరంగా నందలూరులో బ్రిటిష్ కాలంలోని లోకోషెడ్ ఏర్పాటు చేసి అనేక రైల్వే కార్యాలయాలు ఉన్నాయని కానీ ఇప్పుడు వాటిని తరలిస్తున్నారని అన్నారు. వాటిని తరలించకుండా నందలూరుని రైల్వే పరంగా పూర్వ వైభవం కల్పించాలని కేంద్ర మంత్రితో చర్చించినట్లు తెలపారు. చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి ముఖ్యమైన పట్టణానికి వెళ్లడానికి నందలూరు, రాజంపేట రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదల లేక ఆస్పత్రి, వ్యాపార కార్యకలాపాల కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బ్రిటిష్ కాలం నాటి పురాతన రైల్వే స్టేషన్ అయిన రెడ్డిపల్లి చుట్టూ దాదాపు 20 గ్రామాలు విద్యాసంస్థలు, కార్యాలయాలు ఉన్నా కూడా ఇక్కడ నిలుస్తున్న ఇంటర్‌సిటి, అరక్కోణం రైలును కరోనా తర్వాత నిలవడం లేదని ఈ స్టేషన్ పై ఆధారపడి 20 గ్రాములు ఉన్నాయని తెలిపారు. రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఒ రమేష్ అన్నారు. గురువారం బండ్లపై గ్రామంలోని దుర్గంవారిపల్లెలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను కూలీలకు వివరించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ కూడా ఉపాధి హామీపథకం లోని పనులను వినియోగించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది తమ గ్రామంలోనే తమకు అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ పథకము ద్వారా వాటిని అమలపరుస్తున్నారన్నారు. కూలీలు కూడా పనులలో పాల్గొని పథకం ప్రయోజనాలను పొందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు సకాలంలో వేతనాలను చెల్లిస్తున్నాదని వివరించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ కూడా 100 రోజుల పని దినాలను పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలైన పండ్ల తోటలు, పూల మొక్కలను సాగు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నారని తెలిపారు. కొత్తగా జాబ్ కార్డు అవసరమైన వ్యక్తులు ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదిస్తే వారు జాబ్ కార్డును మంజూరు చేయిస్తారని తెలిపారు. సంవత్సర కాలానికి పశుగ్రాసాన్ని అర్ధ ఎకరాలో సాగు చేసిన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.32వేలను అందించడం ఉన్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రయోజనాలను పొందాలని తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బసినికొండ-1 పంచాయతీలో ఉప సర్పంచ్ బావాజాన్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైసిపి నాయకులతో కలిసి నిస్సార్‌అహ్మద్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబునాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, ఇచ్చిన సమయానికి బటన్ నొక్కి ఖాతాలో డబ్బులు వేయడంపైన ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. నాడు అందిన సంక్షేమ ఫలాలు ప్రస్తుతం లేవని వివరించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడు వై.ఎస్.జగన్ అని అన్నారు. ఆయన మరోసారి సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రజా స్పందన చుస్తే తెలుస్తోందన్నారుగుడ్ బుక్ ద్వారా జగన్మోహన్‌రెడ్డి 2.0లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి చైర్ పర్సన్ షమీమ్ అస్లాం, తట్టి శ్రీనివాసులురెడ్డి, దండు కరుణాకర్‌రెడ్డి, వెలుగు చంద్ర, బసినికొండ-1 ఉపసర్పంచ్ బావాజాన్, ఎంపిటిసి మేరీ, శారదారెడ్డి, కొత్తపల్లి మహేష్‌బాబు, హబీబ్, ఎంపిటిసి ముబీనా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే వైసిపి అజెండా

మదనపల్లె అర్బన్ : అభివృద్ధి,సంక్షేమాన్ని అడ్డుకోవడమే వైసిపి అజెండా అని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లి రోడ్డు టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి నాయకులు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి మోసం చేసింది వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డేనన్నారు. మద్యపానం నిషేధం చేసి ప్రజలను ఓట్లు అడుగుతామని, సిపిఎస్ రద్దు చేస్తామని, అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పి అన్నివిధాల మోసం చేశారన్నారు. దీంతో ఆ పార్టీకి 11 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో కూటమి పాలన సూపర్ హిట్ కొట్టిందన్నారు. పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.కార్యక్రమంలోనాయకులు చంద్రశేఖర్‌నాయుడు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇరిగేషన్‌కు రూ.1.02 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ శాఖకు రూ.1.02 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఇరిగేషన్ డిఇఇ ఎం.వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ లోని రైల్వేకోడూరు మండలానికి 15 పనులకు గాను రూ.26 లక్షలు, చిట్వేలి మండలానికి 15 పనులకు గాను రూ.76లక్షలు నిధులు మంజూరు య్యాయని తెలిపారు. ఈ నిధులతో చెరువులు, కాలువల్లో పూడికతీయుట, ముళ్ళ చెట్ల తొలగింపు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఈ పనులు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమం లో పుల్లంపేట ఇన్‌ఛార్జి జెఇ నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య వర్ధంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య ఆరవ వర్ధంతి సందర్భంగా గురువారం రాజంపేటలో ఆయన కుమారుడు పసుపులేటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కేకును కట్ చేసి పేదలకు పంచిపెట్టారు. అనంతరం బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చేసి, అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాల్‌శర్మ నుంచి ఒకసారి, మరోసారి జన్మ భూమి కింద రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అవార్డు అందుకున్న నాయకుడు పసుపులేటి బ్రహ్మయ్య అన్నారు. ఆయన తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలు రాజంపేట నియోజవర్గ అభివృద్ధిపై ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపారు. అరకొరగా ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ఇన్‌ఛార్జిగా ఎన్నికైన చమర్తి జగన్మోహన్ రాజు కూడా పలు సభలు, సమావేశాల్లో బ్రహ్మయ్య రాజంపేట నియోజకవర్గానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, తర్వాత వచ్చిన ఎమ్మెల్యేలు చేసింది ఏమీ లేదని తెలిపిన ఎన్నో సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు.పేదలకు భోజనాన్ని పంపిణీ చేశారు.కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత రమణ, పైడి రవి, ఎద్దల వెంకటేశ్వర్లు, పసుపులేటి చంద్రశేఖర్, ఉద్దండం సుబ్రహ్మణ్యం, తోటరాము, నారాయణ, గౌస్‌బేగ్, సర్దార్ వలి,మన్నూరు మురళీకృష్ణ, మలిశెట్టి సుబ్బరాయుడు, న్యాయవాది వెంకటస్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పాముల సంచారం

- భయాందోళనకు గురైన రోగులు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రెండు భారీ సర్పాలు పట్టపగలు రోగుల కంట పడ్డాయి. నిత్యం వందలాదిమంది వచ్చే ఆసుపత్రి ఆవరణలో సర్పాలు కనపడడం రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆసుపత్రి ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న రెండు 104 వాహనాలను గత కొన్ని సంవత్సరాలుగా అలాగే వదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరి పాములకు నిలయాలుగా మారాయి. ఈ వాహనాలను వేలం వేసి అమ్మకం చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయంతో పాటు అక్కడి నుంచి వాహనం తొలగించే ప్రక్రియ రెండు జరుగుతాయని అంటున్నారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు దీని పై దృష్టి సారించాలని అక్కడికి వచ్చే రోగులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ ఏపుగా పెరిగిన కంప చెట్లు, చెత్తా చెదారం తొలగిస్తే ఇలాంటి విష సర్పాలు రాకుండా కట్టడి చేయవచ్చని కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ఎఎస్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను గురువారం అసిస్టెంట్ అకాడమిక్ అధికారి పివిఎన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది హాజరు, విద్యార్థుల హాజరు, తరగతి గదుల పరిశుభ్రత విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలించారు. విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జెఇఇ, నీట్ తరగతుల విధానం ఎన్ఎంఎంఎస్ క్లాసులపై సమీక్ష చేశారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, పదవ తరగతిలో వందశాతం ఫలితాల సాధన కొరకు ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. రికార్డు లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఎఎంఒ సమీవుల్లా, ప్రిన్సిపల్ మలాంషావలి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'చమర్తి'ని ఇన్‌ఛార్జిగా ప్రకటించడం హర్షణీయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజును సిఎం చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించడం హర్షణీయమని రాజంపేట పార్లమెంటు టిడిపి మహిళా అధ్యక్షురాలు దాసరి రాజువాణి పేర్కొన్నారు. నిరాడంబరుడు, నిస్వార్థంగా పార్టీకి విశేష సేవలందిస్తూ కార్యకర్తలకు అండగా నిలబడే జగన్మోహన్ రాజును అధిష్టానం ఎట్టకేలకు ఇన్‌ఛార్జిగా నియమించడం సంతోషకరమన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లోనూ, 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ సత్తా చాటి టిడిపి విజయ దుందుభి మోగిస్తుందని తెలిపారు.

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోనపి దొడ్డిపల్లి గ్రామం, మదనపల్లి రోడ్డులో గార్గేయనది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. గురువారం ఆలయ ప్రాంగణంలో పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో దేవాదాయ శాఖ ఆలయ ఇఒ మంజుల నూతన పాలకమండలి చైర్మన్‌గా బాలసు బ్రమణ్యం, సభ్యులుగా గాజుల సరస్వతి, వరలక్ష్మి, శైలజ, ఎస్. నాగరాజు, ఎన్. వీరయ్య, ఎస్. హరికృష్ణ, నరసింహన్, సుధారాణి లచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఆలయం మూడు వందల ఏళ్ల క్రితం వాయల్పాడు పోలేపల్లి వంశస్థులు నిర్మించిన అత్యంత పురాతన చరిత్ర కలిగిన ఆలయమని అన్నారు. నూతన పాలకమండలి శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని తెలియజేశారు. ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకమండలికి ఎమ్మెల్యే ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాలక మండలి ఎమ్మెల్యేని శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.